క్లుప్తంగా

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


ధనుష్ నాయక్

నాగార్జునసాగర్ : ఈనెల 29 నుంచి నవంబర్ 9 వరకు గోవాలో జరగనున్న 37వ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు నాగార్జునసాగర్‌కు చెందిన రమావత్ ధనుష్ నాయక్ ఎంపికైనట్లు నెట్‌బాల్ కోచ్, జిల్లా నెట్‌బాల్ కమిటీ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుష్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు .

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి

గుర్రంపోడు : కేంద్రంలో సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సహకారంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రజలు బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉట్లపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు పక్కా ప్రణాళికతో పనిచేసి మండలంలో బీజేపీ సత్తా చాటాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల నాయకుడు మేకల నాగిరెడ్డి పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

గుర్రంపోడు : మండలంలోని చామలేడు గ్రామంలో ఆవుల సత్తయ్యకు చెందిన పశువుల పాక, నాలుగు ట్రాక్టర్ల గడ్డివాము మంగళవారం మధ్యాహ్నం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. సుమారు రూ.80 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

వేణుగోపాల్‌కు నివాళి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి చెందిన కారు డ్రైవర్ వీరమళ్ల వేణుగోపాల్(36) మృతిపై డ్రైవర్ల సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. చింతపల్లి మండలం నసర్లపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేణుగోపాల్ మృతిచెందాడు. సంతాపం తెలిపిన వారిలో భూతరాజు యాదయ్య, మోతీలాల్, హన్మంతు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని అంబటి వాగుకు చెందిన కంచర్ల రోహిత్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడితోపాటు ఎస్సెస్సీ చదువుకున్న సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన స్నేహితులు మంగళవారం రోహిత్‌రెడ్డి తల్లిదండ్రులను పరామర్శించి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన్నెం వెంకటేష్, పులకరం లోకేష్, బత్తిని నాగరాజు, పెద్ది జగన్, పాడిచేటి శేఖర్ తదితరులు ఉన్నారు.

రేపు వారాంతపు సంత బంద్

మునుగోడు : మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంత ఈ గురువారం బంద్ చేస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. సంత నిర్వహించే స్థలంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కారణంగా సంత బంద్ చేస్తున్నామని అన్నారు. మరుసటి గురువారం సంత యథావిధిగా కొనసాగుతుందని, వ్యాపారులు, మండల ప్రజలు గమనించాలని కోరారు.

ఊట్కూరులో ఉద్రిక్తత

శాలిగౌరారం : మండలంలోని ఊట్కూరు గ్రామంలో సోమవారం జరిగిన దసరా వేడుకల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రుణాలు ఇప్పిస్తానని మోసగించిన స్థానిక సర్పంచ్ వేముల లింగయ్యను బాధితులు నిలదీశారు. విషయం తెలుసుకుని ఎస్ఐ సతీష్‌కుమార్ వారిని అడ్డుకుని సర్పంచ్‌ను ఇంటికి పంపించారు. దీంతో ఆగ్రహించిన బాధితులు పోలీసులను రెండు గంటల పాటు అడ్డుకున్నారు. ఫిర్యాదు ఇస్తే సర్పంచ్‌పై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కేతేపల్లి : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని శాలిగౌరారం సీఐ రాఘవరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేతేపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చెర్కుపల్లి, ఇనుపాముల, కేతేపల్లి, కొర్లపహాడ్, గుడివాడ గ్రామాల్లో మంగళవారం కేతేపల్లి పోలీసులు, ఐటీబీపీ జవాన్లు కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాటించాల్సిన నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

- కోల్‌ముంతలపహాడ్ పరిధి సర్వే నంబర్ 202లో ఇళ్ల నిర్మాణం
- అధికారులు కూల్చివేస్తున్నా ఆగని ఆక్రమణలు
- అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని స్థానికుల వేడుకోలు


ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కోల్‌ముంతల పహాడ్ గ్రామంలోని బాపూజీ నగర్ సమీపంలో జాతీయ రహదారి 167ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 202లో కొంత మంది ఆక్రమించుకొని అక్రమంగా గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ నిర్మాణాలపై పలు సందర్భాలలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తూతూ మంత్రంగా వెళ్లి నోటీసులు ఇచ్చి ప్రారంభంలో ఉన్న వాటిని ఒకటి రెండు సార్లు తొలగించారు. కానీ రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీని వెనుక స్థానిక అధికార పార్టీ రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. ఇదే సర్వే నంబర్లు గతంలో ప్రస్తుతం నల్లగొండలో ఉన్న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఇక్కడ నిర్మించాలని సర్వేలు కూడా జరిగాయి. కానీ కొన్ని రాజకీయ కారణాల వల్ల ఆ విశ్వవిద్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. సుమారుగా ఈ సర్వే నంబర్లలో 295 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. ముఖ్యంగా ఈ భూమి జాతీయ రహదారి 167కు ఆనుకొని ఉండడంతో అందరి కళ్లు దానిమీద పడ్డాయి. ఒకవేళ జీఓ నంబర్ 84 ప్రకారం వాటిని క్రమబద్ధీకరణ చేసుకోవాలనుకుంటే ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించి ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని ఆక్రమణదారులకు రాతపూర్వకంగా రెవెన్యూ అధికారులు రాసి ఇచ్చారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు చెపడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. దాని తర్వాత హైకోర్టు జీఓ నంబర్ 84పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఆ అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఇటీవల రాష్ట్ర హైకోర్టు జీఓ నెం. 84ని నిలుపుదల చేసింది. అయినప్పటికీ ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నిర్మాణాలను ప్రభుత్వ రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారు.

అనుమతి లేకున్నా విద్యుత్ కనెక్షన్లు

అంతేకాకుండాఆ అక్రమ నిర్మాణాలు చేపట్టినటువంటి కొల్‌ముతలపహాడ్ గ్రామపంచాయతీ నుంచి అనుమతి లేకుండానే విద్యుత్ అధికారులు మీటర్లను ఎలా బిగించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఏఈ దేవోజీని వివరణ కోరగా సరైన ఆధారాలు ఉంటేనే మీటర్ మంజూరు చేయడం జరుగుతుందని, లేనట్లయితే మంజూరు చేయడం కుదరదని అయితే కొంత మంది ప్రైవేటు బాండ్లపై నూతన మీటర్లు కావాలని తీసుకురావడం వల్ల మంజూరు చేసినట్లు తెలిపారు ఆ మీటర్లు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు అని తెలిశాఖ వాటిని రద్దు చేసి మీటర్లను వాపస్ తీసుకోనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా కొల్‌ముతలపహాడ్ గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా అక్రమంగా నిర్మిస్తున్న ఇట్టి నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామని వాటిని కూల్చి వేయడానికి ఎవరూ సహకరించకపోవడంతోనే వారు అలాగే నిర్మాణాలను రాత్రి రాత్రి చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాల్సిన అవసరం ఉంది.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం



కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 202 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గతంలో తొలగించాం. జీఓ నంబర్ 84 ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించి అనుమతి లభించిన తర్వాత నిర్మించుకోవాలని వారికి తెలియజేశాం. కానీ ఇటీవల హైకోర్టు జీఓ నంబర్ 84 ను నిలిపివేయడంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. కానీ కొంత మంది రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలను త్వరలో కూల్చివేస్తాం.

– దివ్యరెడ్డి, తహసీల్దార్, కొండమల్లేపల్లి

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం


హాలియా : కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జైవీర్‌రెడ్డి

హాలియా : కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతోందని సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలంలోని అన్నారం, హజారిగూడెం, గుర్రంపోడు మండలంలోని ములకలపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీ కార్యకర్తలు మంగళవారం కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జైవీర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమలతో ప్రజలు విసుగుచెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు జెడ్పీటీసీ గాలి సరిత రవికుమార్, మాజీ ఎంపీపీ చలమల జగదీశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అన్నారం సర్పంచ్ కట్ట సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ కట్ట శ్రీనివాస్‌రెడ్డి నాయకులు బొమ్మపాల లింగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని పలు గ్రామాల్లో నాగార్జున సాగర్ నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని బెజ్జికల్ గ్రామంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ నెల 26న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బెజ్జికల్ మాజీ సర్పంచ్ ఇండ్ల జానకి రాములు, ప్రస్తుత సర్పంచ్ గజ్జెల కోటిరెడ్డిలు వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ గ్రామాభివృద్ధితో పాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని జైవీర్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, ఎంపీటీసీ బైరెడ్డి హైమావతి, ఎంపీపీ గౌరవ సలహాదారు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, జిల్లా సంయుక్త కార్యదర్శి జానయ్య, వెంకటరమణ, లక్ష్మయ్య, అంజి పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- డీఎస్పీ వెంకటగిరి


ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా మీకు రక్షణ కల్పించే బాధ్యత పోలీసులుగా తాము చూసుకుంటామని మిర్యాలగూడ డీఎస్పీ పి.వెంకటగిరి అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ బెటాలిన్ ఫోర్స్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతాలుగా భావిస్తున్న రాంనగర్, సుందర్ నగర్, గాంధీనగర్, కలల్‌వాడ, పెద్దబజారు వంటి ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి కోడ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, ప్రతి ఒక్కరు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన ఎంతటి వారినైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాఘవేందర్, ఎస్ఐ శ్రీను నాయక్ ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ మేనిఫెస్టో విడుదల


మేనిఫెస్టో విడుదల చేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మిర్యాలగూడ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ తనదైన శైలిలో ప్రచారం చేయడానికి సిద్ధమయ్యాడు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను అధిష్టానం విడుదల చేయగా సోమవారం దసరా పండుగ సందర్భంగా తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని ×బీఎల్ఆర్ మానిఫెస్టో×ను విడుదల చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని వార్డులు, మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం నుంచి ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టాలని కోరారు. బీఎల్ఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలో మిర్యాలగూడ జిల్లా సాధనకు కృషి, నిరుపేదలకు దసరా పండుగ కానుక, శ్రీశ్రీనివాస కల్యాణ శుభమస్తు కానుక, ప్రజా వైద్య సేవ, రైతు సేవ, హైందవ సేవ, ముస్లీం మైనార్టీల సేవ, క్రైస్తవ మైనార్టీల సేవ, నవ నిర్మాణ కులాల అభివృద్ధి, యువజ సేవ, కార్మిక సేవ, మున్సిపాలిటీ, మండలాభివృద్ధి , సామాజిక ఉత్సవ సేవ, ప్రజా పోరాట సేవ, బాలిక సేవ, అనాథల సేవ, నిత్య సేవా కార్యక్రమాలు ఉన్నాయి.

సీఎం కేసీఆర్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

మునుగోడు : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ నెల 26న మునుగోడులో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను మంగళవారం అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్ దాదాపు రూ. 2వేల కోట్లకుపైగా నిధులు మంజూరుచేశారన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి ప్రతి ఓటరు కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఆయన వెంట కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, ఎంపీపీ స్వామి, పురుషోత్తం రెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, కుమారస్వామి, విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర


మిర్యాలగూడ అర్బన్ : దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


దేవరకొండ : శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ అర్బన్ : తొమ్మిదిరోజులుగా వివిధ రూపాలలో పూజలు అందుకున్న కనకదుర్గాదేవి ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలో నిర్వహించిన దుర్గామాతా ప్రత్యేక పూజలో భాగంగా ఒక్కో రోజు ఒక్కో రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి చివరి రోజున మహిశాశురవర్ధినిగా, రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చింది. అనంతరం అమ్మవారి వద్ద ఉంచి కలశాలు, తొమ్మిరోజులు అమ్మవారికి ఉపయోగించిన పట్టు వస్త్రాలు వేలంద్వార దగ్గించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. మంగళవారం అమ్మవారి శోభాయాత్ర బక్తుల కోలాటాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు ఇంచార్జి గొంగడి సైదిరెడ్డి, కమిటి సభ్యులు గోవిందరెడ్డి, సంపత్, మణి, గోవర్ధన్‌రెడ్డి, కిరణ్, లావుడి ధనలక్ష్మి, శ్రీను, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, శోభ, పాల్గొన్నారు.

దేవరకొండ : నవ రాత్రులు భక్తులతో విశేష పూజలందుకున్న దుర్గామాత శోభాయాత్రను మంగళవారం దేవరకొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల నిర్వహకులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు శోభాయాత్రలో భాగంగా కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు వెంకటంపేట, కుర్మేడు, కుర్రంపల్లి, మాల్ వెంకటేశ్వరనగర్ గ్రామాల్లో దుర్గామాత శోభాయాత్ర మంగళవారం కన్నుల పండువగా సాగింది. శోభాయాత్ర సందర్భంగా అమ్మవారి చీరలకు వేలంపాట నిర్వహించారు. మహిళలు కోలాటాలు ఆడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు.

హాలియా : దసరా పండుగ వేడుకల సందర్భంగా పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో మాత నాగమ్మ ఆధ్వర్యంలో మహిళా మాతలు బోనమెత్తారు. ఈ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. అనంతరం దుర్గాదేవీ అమ్మవారికి బోనాలు సమర్పించి నైవేద్యం పెట్టారు. ఈ కార్యక్రమంలో నవగణపతి యూత్ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, చంద్రమౌళి, హరి, నరసింహ, వెంకట్, శంకర్, ప్రకాష్, విజయ్, వెంకట్, ప్రవీణ్, కళ్యాణ్ పాల్గొన్నారు.


హాలియా : బొడ్రాయి బజార్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

మిర్యాలగూడ టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి విగ్రహాలను మిర్యాలగూడ పట్టణం నుంచి దామరచర్ల మండలంలోని వాడపల్లి వద్ద గల కృష్ణానదికి తరలించి నిమజ్జనం చేశారు.

త్రిపురారం : దేవీశరన్నావరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మర్రిగూడెం గ్రామంలో దుర్గామాతా ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడెం సర్పంచ్ బాల్తి పద్మ శ్రీనివాస్, వీరభద్రం, భవాని స్వాములు తధితరులు పాల్గొన్నారు.


చింతపల్లి : కోలాటం ఆడుతున్న మహిళలు


మిర్యాలగూడ టౌన్ : ముత్తిరెడ్డికుంటలో..

ఘనంగా విజయదశమి వేడుకలు

మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల రావణ దహనం నిర్వహించారు. జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్


మిర్యాలగూడ : రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు


హాలియా : జమ్మి తీసుకుంటున్న సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్


చింతపల్లి : రావణ దాహనం నిర్వహిస్తున్న గ్రామస్తులు


హాలియా : సీతారామాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి


దేవరకొండ : దసరా ఉత్సవాల్లో కిషన్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ సభ్యులు


చందంపేట : జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు


తిరుమలగిరి : అల్వాలలో..


డిండి: జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు

దేవరకొండ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలునాయక్

చందంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకొండ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చిత్రియాల, నల్లచెలమూల, వెంకట్‌నాయక్‌తండా, గాగిళ్లాపురం గ్రామాల నుంచి సుమారు 100 కుటుంబాలు పీసీసీ సభ్యుడు, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి బాలునాయక్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందర్నారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాన్, ఎంపీపీ పార్వతిచందునాయక్, సర్పంచ్ రంగయ్యగౌడ్, బాలునాయక్, యాదయ్య, ఆనంద్, లెండాల మోహన్‌రావు, నారాయణనాయక్, గన్య బావోజి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు దుబ్బ రూప, మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్ సుందర్ దంపతులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా గెలిచిన దుబ్బ అశోక్ సుందర్ 2016లో బీఆర్ఎస్‌లో చేరి తిరిగి మంగళవారం సొంతగూటికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ : నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి గుమ్ముల మోహన్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగుపల్లిలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జూలకంటి వెంకట్‌రెడ్డి, నాయకులు చల్ల పద్మారెడ్డి, ఎలక సైదిరెడ్డి, విజయ్, రమేష్, గోపి, శేఖర్, వెంకన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.